సాక్షి
కామారెడ్డి
ఆదివారం । 31 । డిసెంబర్ । 2023



బస్టాండ్ ఎదుట ధర్నా

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదుట ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళనకు దిగారు.

- 9లో ▸



హైవేపై కారు దగ్ధం

మద్నూర్ మండలం రూసేగావ్ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం కారు దగ్ధమైంది.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
29.8 /12.8

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

మితిమీరితే చర్యలు తప్పవు

కామారెడ్డి క్రైం: నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా, ఆనందోత్సవాలతో జరుపుకోవాలని ఎస్పీ సింధు శర్మ శనివారం ఓ ప్రకటనలో సూచించారు. వినోదం విషాదంగా మారకుండా వేడుకలు జరుపుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. మద్యం సేవించి అతి వేగంగా వాహనాలు నడిపినా, త్రిబుల్ రైడింగ్, కేరింతలు కొడుతూ స్నేక్ డ్రైవింగ్ చేసినా, అశాంతి వాతావరణం కలిగించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లల తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు ఇవ్వకూడదని సూచించారు. రాత్రి 12 గంటల తర్వాత రోడ్లపై కేకు లు కట్ చేయడం, డీజేలు పెట్టడం, డాన్సు లు, మద్యం సీసాలతో బహిరంగంగా కని పించిన వారిపై చర్యలు ఉంటాయన్నారు. ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించినా, సోషల్ మీడియాలో అసభ్యకరంగా గానీ, అభ్యంతరకరంగా గానీ పోస్టులు పెట్టినా కేసులు నమోదు చేస్తామన్నారు. వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవడం కోసం జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తామని చెప్పారు.

ప్రయాణికులతో ఆప్యాయంగా మాట్లాడాలి



కామారెడ్డి టౌన్: ఆర్టీసీ బస్సులో ఎక్కిన ప్రయాణికులతో ఆప్యాయంగా మాట్లాడాలని ఆర్టీసీ నిజామాబాద్ రీజినల్ మేనేజర్ జానిరెడ్డి డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందికి సూచించారు. శనివారం కామారెడ్డి డిపోను ఆకస్మికంగా సందర్శించారు. మహాలక్ష్మి ఉచిత బస్ ప్రయాణం పథకంపై సూచనలు చేశారు. మహిళలకు, పురుషులకు ఇబ్బందులు లే కుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఎం ఇందిరా, అధికారులు వసుంధర, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాపాలనకు దరఖాస్తుల వెల్లువ

- మూడో రోజు 51,494 అప్లికేషన్లు

కామారెడ్డి క్రైం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ జిల్లాలో జోరుగా కొనసాగుతోంది. అన్ని డివిజన్ల పరిధిలో భారీగా దరఖాస్తులు వస్తున్నాయి. శనివారం మూడో రోజు కామారెడ్డి డివిజన్ పరిధిలో 28,063, ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలో 7,190, బాన్సువాడ డివిజన్ పరిధిలో 16,241 దరఖాస్తులు వచ్చాయి. దీంతో మూడు రోజుల వ్యవధిలో జిల్లా మొత్తం మీద 1,07,262 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి, లింగాపూర్, తాడ్వాయి మండలం కృష్ణాజీవాడి గ్రామాల్లోని కేంద్రాలను కలెక్టర్ జితేష్ వి పాటిల్ సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. మాచారెడ్డి మండలం ఘన్‌పూర్‌లో ప్రజాపాలన కార్యక్రమాన్ని డీపీవో శ్రీనివాస్‌రావు పరిశీలించారు. లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

రెండు రోజులు సెలవు

కామారెడ్డి టౌన్ : డిసెంబర్ 31 ఆదివారం, జనవరి 1న ప్రజా పాలన కార్యక్రమం ఉండదని మున్సిపల్ కమిషనర్ దేవేందర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి 2వ తేది నుంచి దరఖాస్తులను స్వీకరిస్తామని పేర్కొన్నారు.

లోక్ అదాలత్‌లో 8,320 కేసుల పరిష్కారం

కామారెడ్డి క్రైం: జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 8,320 కేసులను పరిష్కరించినట్లు జిల్లా జడ్జి శ్రీదేవి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి కోర్టులో 3 బెంచీలు, ఎల్లారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద కోర్టుల్లో ఒక్కో బెంచ్ చొప్పున ఏర్పాటు చేసి రాజీ కుదుర్చుకోదగిన కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. ఆయా కోర్టుల పరిధిలో సాయంత్ర 6 గంటల వరకు కేసుల పరిష్కారం జరిగిందన్నారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా పెండింగ్‌లో ఉన్న కేసులకు సత్వర పరిష్కారం లభిస్తుందని జిల్లా జడ్జి పేర్కొన్నారు.

గాయత్రిలో చెరుకు క్రషింగ్

సదాశివనగర్: మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతోంది. శుక్రవారం నాటికి లక్షా 36 వేల 804 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు తెలిపారు.



బీబీపేటలో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న గ్రామస్తులు




నిజాంసాగర్ మండల కేంద్రంలో..

ఊరూరా ఊరేగింపు

- అయోధ్య రామయ్య అక్షింతలకు బ్రహ్మరథం
- భక్తి పారవశ్యంలో హారతులు పడుతున్న జనం
- గడపగడపకూ పంచేందుకు ఏర్పాట్లు

సాక్షి, కామారెడ్డి : అయోధ్యలో భవ్య రామమందిర నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న తరుణంలో శ్రీరామజన్మభూమి తీర్థ ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్యలో పూజిత అక్షింతలను ఊరూరికి పంపిస్తున్నారు. పల్లెలు, పట్టణాల్లో రాములోరి పూజిత అక్షింతలను ప్రజలు ఎంతో భక్తి శ్రద్ధలతో హారతులు పట్టి శోభాయాత్రలు నిర్వహిస్తున్నారు. ఊరూవాడా అంతటా పూజిత అక్షింతల ఊరేగింపు కార్యక్రమాలు పెద్దఎత్తున నిర్వహిస్తున్నారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లా కేంద్రాలతో పాటు ఉమ్మడి జిల్లాలోని ఆయా పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లోనూ పూజిత అక్షింతలను ఊరేగిస్తున్నారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం కోసం వందల ఏళ్లుగా ఎదురుచూస్తున్న భక్తుల కల నెరవేరుతోంది. ఉమ్మడి జిల్లా నుంచి అప్పట్లో రామమందిరం కోసం జరిగిన అనేక కార్యక్రమాల్లో వేలమంది పాల్గొన్నారు. మందిర నిర్మాణం కోస విరాళాలు కూడా చాలా మంది సమర్పించారు. అయోధ్యలో రామయ్య పూజలు అందుకున్న అక్షింతలు తమ ఊరికి కావడంతో భక్తులు అయోధ్యకు వెళ్లివచ్చినంత ఆనందంగా ఫీలవుతూ వాటిని తలపై పెట్టుకుని మోస్తూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగిన శోభాయాత్రలో స్థానిక ఎమ్మెల్యే కాటిపల్లి వెంకరటమ ణారెడ్డి పాల్గొన్నారు. చాలా గ్రామాలు, పట్టణాల్లో పార్టీలకు అతీతంగా అన్నివర్గాల వారు ఊరేగింపుల్లో పాల్గొని భక్తిభావం చాటుతున్నారు. వివిధ పట్టణాలు, గ్రామాల్లోనూ ర్యాలీల్లో జనం పాల్గొంటూ రాముని అక్షింతలకు మొక్కుతున్నారు.



ఇంటింటికీ అక్షింతలు

అయోధ్య రామయ్య ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా పూజిత అక్షింతలను ఊరూరుకి పంపిస్తున్న శ్రీరామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ వాటిని ప్రతి ఇంటికీ పంపించేందుకు ఏర్పాట్లు చేస్తుంది. జనవరి 1 నుంచి 10 వరకు ఆయా గ్రామాల్లో రాములవారి పూజి త అక్షింతలను అలాగే చిత్రపటాన్ని ప్రతి ఇంటికీ చేర్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే చాలా పట్టణాలు, గ్రామాల్లో అయో ధ్య రామయ్య పూజిత అక్షింతలు చేరాయి. మిగతా గ్రామాలకూ వాటిని చేర్చే పనుల్లో ఉన్నారు. అయోధ్యలోని రామ మందిరం ప్రారంభమయ్యే సమయంలో ప్రతి ఇంట్లో పూజిత అక్షింతలు చేరేలా ప్రణాళిక రూపొందించారు. దీనికోసం వందల మంది శ్రమిస్తున్నారు.

సండే స్పెషల్

ప్రతి కుటుంబానికి అక్షింతలు అందిస్తాం



అయోధ్యలో రామ మందిర నిర్మాణాన్ని పురస్కరించుకుని జిల్లాలోని అన్ని గ్రామాలు, పట్టణాల్లో అయోధ్య రాముడి అక్షింతలతో శోభాయాత్రలు నిర్వహిస్తున్నాం. ప్రతి హిందువును కార్యక్రమంలో భాగస్వాములను చేస్తున్నాం. జవవరి 1వ తేది నుంచి గడగడపకూ వెళ్లి అక్షింతలను అందిస్తాం. జనవరి 22న ప్రాణప్రతిష్టగా ఈ అక్షింతలను పెద్దల చేతుల మీదుగా తలపై ధరించాలి. – బోనగిరి గోపాలకృష్ణ, శ్రీరామతీర్థ క్షేత్ర ట్రస్టు జిల్లా అధ్యక్షుడు, కామారెడ్డి

ప్రతి ఇంటిముందు దీపాలు వెలిగించాలి



ప్రతి ఇంటింటికి శ్రీరాముడి అక్షింతలు అందేలా బృందాలను ఏర్పాటు చేశాం. హిందువులందరినీ చైతన్యం చేస్తున్నాం. జనవరి 22వ తేదీన ప్రతి హిందువు వారి ఇంటి ముందు ఐదు దీపాలను వెలిగించి కృతజ్ఞత చాటాలి. – గంగారెడ్డి, శ్రీ రామతీర్థ క్షేత్ర ట్రస్టు జిల్లా ఉపాధ్యక్షుడు, కామారెడ్డి

కరసేవకుల త్యాగ ఫలితమే..



కరసేవకుల త్యాగ ఫలితమే రామ మందిర నిర్మాణం. రామాలయం ట్రస్టు ద్వారా దేశంలోని ప్రతి ఇంటికి రాముడి పాదాలను తాకిన అక్షింతలను పంపడం సంతోషకరం. వీటిని ప్రతి ఒక్కరూ స్వీకరించి తలపై వేసుకోవాలి.
– వినోద్‌కుమార్, బజరంగ్‌దళ్, జిల్లా కో కన్వీనర్, ఎల్లారెడ్డి

మా అదృష్టంగా భావిస్తున్నాం



రామ జన్మభూమి నుంచి రాములోరి అక్షింతలు మా దగ్గరకు రావడం అదృష్టం. ఎన్నోఏళ్లుగా ఎదురుచూస్తున్న అయోధ్య రామ మందిర నిర్మాణం మా కళ్ల ముందు పూర్తికావడం ఆనందకరం. మందిర నిర్మాణం కోసం ఎంతో పరితపించాం. ఆలయ ప్రారంభోత్సవానికి వెళ్లాలని ఉన్నా ఆరోగ్య కారణాల దృష్ట్యా వెళ్లలేకపోతున్నా. – తమ్మెవార్ రమేశ్‌సేట్, మద్నూర్

అక్షింతలు దైవంతో సమానం



అయోధ్య రామ మందిరం నుంచి వచ్చిన అక్షింతలు దైవంతో సమానం. రామ మందిర నిర్మాణం ఎప్పుడెప్పుడా అని ఎదురుచూశాం. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను ప్రతి గ్రామానికి పంపించాం. ప్రతి ఇంటికి రాములోరి అక్షింతలు చేరేటట్లు ఏర్పాట్లు చేశాం. – బాల్‌కిషన్, మద్నూర్

ఎంతో ఆనందంగా ఉంది



శ్రీరాముడి అక్షింతలు అయోధ్య నుంచి ఎల్లారెడ్డికి రావడం సంతోషకరం. ప్రతి ఒక్కరూ రామ మందిర నిర్మాణం కోసం సంకల్పం చేసి నిధి సేకరణ చేయడం జరిగింది. దీంతో ఆలయ నిర్మాణం పూర్తి కావడంతో పాటు శ్రీరాముడి పాదాలను తాకిన అక్షింతలను పంపడం జరిగింది. చాలా ఆనందంగా ఉంది.
– మంచిర్యాల శ్రీకాంత్, ఆర్‌ఎస్‌ఎస్ ఖండ కార్యవాహ, ఎల్లారెడ్డి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రజాపాలన
- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్(జుక్కల్): ఆరు గ్యారంటీ పథకాలను అర్హులందరికీ అందించాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసమే సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలనను తీసుకువచ్చారని పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులు తమవంతు బాధ్యతను తీసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. శనివారం నిజాంసాగర్ ప్రాజెక్టు గుల్‌దస్తా వద్ద ఆర్‌డబ్ల్యూఎస్, ట్రాన్స్‌కో, అటవీ, ఆర్టీసీశాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్షించారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఉన్న తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయించి క్లోరినేషన్ చేయాలన్నారు. వ్యవసాయరంగానికి త్రీఫేజ్ కరెంట్ సరఫరాలో కోతలు లేకుండా విద్యుత్తును సరఫరా చేయాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. డీడీలు కట్టిన రైతులకు సకాలంలో ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయాలని సూచించారు. మారుమూల ప్రాంతాలు, గిరిజన తండాలకు బీటీ రోడ్లకు నిధు లు ఇస్తామని, అనుమతులు ఇవ్వాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని, పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేక బస్సులు వేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

నేడు అర్ధరాత్రి వరకు వైన్‌షాపులు ఓపెన్

ఖలీల్‌వాడి(నిజామాబాద్) : నేటి అర్ధరాత్రి వరకు వైన్‌షాపులు తెరిచి ఉంటాయని ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 31 సందర్భంగా వైన్‌షాపులు రాత్రి 12 గంటల వరకు, బార్‌లు అర్ధరాత్రి ఒంటి గంట వరకు ఓపెన్ చేసి ఉంటాయన్నారు. జిల్లాలో 102 వైన్‌షాపులు, 17 బార్లులు ఉన్నట్లు తెలిపారు. సాధారణంగా ప్రతిరోజు వైన్‌షాపులు రాత్రి 10 గంటలకు, బార్‌లకు రాత్రి 11 గంటలకు మూసివేసేవారు. డిసెంబర్ 31వ తేదీ మాత్రమే వెసులుబాటు కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు.

మిల్లింగ్‌ను త్వరగా పూర్తి చేయాలి

- పౌర సరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

కామారెడ్డి క్రైం: ధాన్యం మిల్లింగ్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లు, పౌర సరఫరాల అధికారులతో మాట్లాడారు. ఖరీఫ్ 2023–24 ధాన్యం మిల్లింగ్‌ను పూర్తి చేయాలన్నారు. కామారెడ్డి జిల్లాలో గత యాసంగిలో సేకరించిన 2,18,193 మెట్రిక్ టన్నులు పెండింగ్‌లో ఉందన్నారు. తక్షణమే మిల్లింగ్ పూర్తి చేయించి గోదాంలకు సరఫరా చేస్తామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. ఇందులో 1,15,828 మెట్రిక్ టన్నులు బాయిల్డ్ రైస్ మిల్లింగ్ పెండింగ్‌లో ఉందన్నారు. దానిని కూడా త్వరలోనే పూర్తిచేయిస్తామని మంత్రికి వివరించారు. అనంతరం అదనపు కలెక్టర్ చంద్రమోహన్ కలెక్టరేట్‌లో రెవెన్యూ, సివిల్ సప్లయ్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సూచనలు చేశారు. మిల్లర్లకు నిర్దేశించిన ప్రకారం మిల్లింగ్ చేయని రైస్‌మిల్లుల యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు. జనవరి 7లోగా లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల మేనేజర్ అభిషేక్ సింగ్, ఏఎస్‌వో నిత్యానంద్ పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

వెంటనే వివరాలివ్వండి

- బ్యాంకు లావాదేవీలు, మద్యం అమ్మకాల రిపోర్టులు అందజేయాలి
- కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశం

కామారెడ్డి క్రైం: గత పార్లమెంటు, శాసనసభ ఎన్నికల సందర్భంగా జరిగిన బ్యాంకు లావాదేవీలు, మద్యం విక్రయాలు, గత ఆరు నెలల బ్యాంకు లావాదేవీలు, మద్యం అమ్మకాల వివరాలను వెంటనే అందజేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం వ్యయ సునిశిత నియోజక వర్గాల గుర్తింపు(ఈఎస్‌సీ), వ్యయ సునిశిత పాకెట్(ఈఎస్‌పీ, జిల్లా కేంద్రంలోని కొంత భాగం)ల గుర్తింపు నిమిత్తం ఏర్పాటు చేసిన ఎన్నికల విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. రాబోయే పార్లమెంటు ఎన్నికలను సజావుగా నిర్వహించడానికి గాను గత ఎన్నికల వివరాలను సేకరించడం ద్వారా తగిన ప్రణాళికలు రూపొందించాలన్నారు. స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌లో భాగంగా గత ఎన్నికలల్లో నియోజకవర్గంలో విచ్చలవిడిగా ధన వ్యయం చేసిన వివరాలను సెక్టార్ వారీగా సమగ్ర నివేదిక అందించాల్సి ఉంటుందన్నారు. ఈఎస్‌పీని గుర్తించడానికి నగదు, మద్యం, ఫిర్యాదులు ప్రామాణికమన్నారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికలలో జిల్లాలో రూ. 6.65 కోట్ల విలువైన నగదు, మద్యం, మత్తు పదార్థాలు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. అంతే కాకుండా సి-విజిల్ యాప్ ద్వారా 157 కేసులు నమోదయ్యాయని తెలిపారు. స్వాధీనం చేసుకున్న డబ్బు, మద్యం, నమోదు చేసిన కేసుల వివరాలు, తరచుగా నేరాలకు పాల్పడుతున్న వారి వివరాలను అందించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ సుధీర్ భార్గవ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

పెరిగిన చోరీలు

- స్వల్పంగా తగ్గిన రోడ్డు ప్రమాదాలు
- గతేడాదితో పోలిస్తే జిల్లాలో కేసుల సంఖ్యలో తగ్గుదల
- ఏడాదిలో 5,529 కేసులు నమోదు
- 2023 క్రైం రివ్యూలో ఎస్పీ సింధు శర్మ

కామారెడ్డి క్రైం: కామారెడ్డి జిల్లాలో గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది నమోదైన కేసుల సంఖ్య స్వలంగా తగ్గింది. కానీ దొంగతనాలు పెరిగాయి. రోడ్డు ప్రమాదాలు కొంత మేరకు తగ్గాయి. మిగతా నేరాలన్నీ సంఖ్యాపరంగా దాదాపు గతేడాదికి దగ్గరగానే నమోదైనట్లు పోలీసుశాఖ వార్షిక నివేదిక ద్వారా తెలుస్తుంది. గతేడాది మొత్తం 5,582 కేసులు నమోదు కాగా ఈ ఏడాది 5,529 కేసులు నమోదయ్యాయి. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన 2023 క్రైం రివ్యూ విలేకరుల సమావేశంలో ఎస్పీ సింధు శర్మ వివరాలు వెల్లడించారు. కుటుంబ కలహాలే హత్యలకు ప్రధాన కారణయవుతున్నాయని ఆమె పేర్కొన్నారు. ప్రమాదాలు, నేరాలను నియంత్రించడానికి జిల్లాలో కట్టుదిట్టమైన భద్రతా, జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఎన్నికల సమయంలో 3,422 మందిని బైండోవర్ చేశామన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ సింధు శర్మ

పాత నేరస్తులపై నిఘాతో పాటు, కొత్తగా నేరాలకు పాల్పడుతున్న వారిని గుర్తించే పనిలో ఉన్నామన్నారు. వరుస ఆరు హత్యల కేసులో నిందితులను సాంకేతిక పరిజ్ఞానం ద్వారా గుర్తించడం, చోరీ ముఠా నుంచి రూ. 36.60 లక్షల విలువైన 51 ద్విచక్ర వాహనాలను ఒకేసారి స్వాధీనం చేసుకోవడం, 40 ట్రాన్స్‌ఫార్మర్ కేసులను చేధించి 72 ట్రాన్స్‌ఫార్మర్లకు చెందిన రూ. 7.60 లక్షల విలువైన సొత్తును రికవరీ చేయడం, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించడం ఈ ఏడాది జిల్లా పోలీసుశాఖకు సంబంధించిన ముఖ్యమైన అంశాలని పేర్కొన్నారు.

706 చోరీ కేసులు

జిల్లా వ్యాప్తంగా దొంగతనాలు పెరిగాయి. గతేడాది 643 చోరీ కేసులు నమోదు కాగా ఈ ఏడాది 706 కేసులు నమోదయ్యాయి. వాటిలో 65 శాతం కేసులను ఛేదించి 63శాతం సొత్తును రికవరీ చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ ఏడాది రోడ్డు ప్రమాదాలు స్వల్పంగా తగ్గాయి. గతేడాది మొత్తం 516 ప్రమాదాలు జరిగాయి. వాటిలో 271 మంది మృతి చెందగా 502 మంది గాయాలపాలయ్యారు. ఈ ఏడాది మొత్తం 496 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. వీటిలో 226 మంది మృత్యువాత పడగా 480 మంది గాయాలతో ఆస్పత్రుల పాలయ్యారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టడం కోసం జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు, గ్రామసభలు, సీసీ కెమెరాలు, స్పీడ్ గన్‌లను ఏర్పాటు చేసి స్పీడ్ లిమిట్ పెట్టడం, డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు, వాహనాల తనిఖీలను పకడ్బందీగా చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. అందుకే రోడ్డు ప్రమాదాల్లో తగ్గుదల కనిపిస్తుందన్నారు.

కుటుంబ, ఆస్తి తగాదాలే హత్యలకు కారణం

జిల్లాలో ఈ ఏడాది 28 హత్య కేసులు నమోదయ్యాయి. వాటిలో 20 కేసులు కుటుంబ సభ్యుల మధ్య కలహాలు, ఆస్తి వివాదాల నేపథ్యంలోనే జరిగినట్లు పోలీసు విచారణలో వెల్లడైందని ఎస్పీ తెలి పారు. అన్ని హత్య కేసుల్లోనూ నేరస్తులను గుర్తించి కోర్టుకు హాజరుపర్చడం జరిగిందన్నారు. వీటిలో ప్రధానమైనది ఇటీవల వెలుగుచూసిన ఆరు హత్యల కేసు. మహిళలపై జరిగే నేరాలు 2022లో 351 కేసులు నమోదు కాగా ఈసారి 346 నమోదయ్యాయి. చిన్నారులు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను నియంత్రించడానికి ఈ ఏడాది షీ టీంల ద్వారా 641 అవగాహన కార్యక్రమాలు, 1,202 ప్రాంతాల్లో గస్తీ చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. దీంతో నేరాలు అదుపులోకి వచ్చాయన్నారు.

755 సెల్‌ఫోన్ల రికవరీ..

డయల్ 100కు ఈ ఏడాది మొత్తం 43,448 ఫిర్యాదులు వచ్చాయన్నారు. వాటిలో 206 కేసులు నమోదు కాగా మిగతా వాటిని రాజీ ద్వారా పరిష్కరించడం జరిగిందన్నారు. ఈ ఏడాది 124 మంది బాల కార్మికులను గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించడం జరిగిందని తెలిపారు. కొత్తగా వచ్చిన సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను గుర్తించడంలో రాష్ట్రంలోనే కామారెడ్డి జిల్లా ముందంజలో ఉందన్నారు. ఈ ఏడాది 755 సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించామని తెలిపారు. విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టడం ద్వారా సైబర్ నేరాలు తగ్గుతున్నట్లు ఎస్పీ తెలిపారు. గతేడాది 294 సైబర్ క్రైం కేసులు నమోదు కాగా ఈ ఏడాది 240 కేసులు నమోదయ్యాయని వెల్లడించారు. 2024లో మరింతగా నేరాలను నియంత్రించడానికి అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. చిన్న చిన్న డయల్100 ఫిర్యాదులను అక్కడికక్కడే పరిష్కరించడం, పెట్టీ కేసులను ఎక్కువగా నమోదు చేయడం ద్వారా పెద్ద నేరాలను అదుపు చేయడం, డ్రంకన్ డ్రైవ్ టెస్ట్‌లు పెంచడం, బీట్, పెట్రోలింగ్ వ్యవస్థను పటిష్టం చేయడం, నంబర్ ప్లేట్ లేని వాహనాలపై దృష్టి పెట్టడం లాంటి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. సమావేశంలో ఏఎస్పీ నర్సింహారెడ్డి, సీఐలు చంద్రశేఖర్ రెడ్డి, సంతోష్ కుమార్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

చరిత్రలో నిలిచిపోనున్న ప్రధాని మోదీ



బోధన్ రూరల్: అయోధ్యలో రామ మందిర నిర్మాణంతో ప్రధాని మోదీ చరిత్రలో నిలిచిపోనున్నారని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. మండలంలోని పెగడపల్లిలో అయోధ్య రామ మందిరం నుంచి వచ్చిన అక్షింతలను ఎంపీ శనివారం నిర్వహించిన ఊరేగింపులో పాల్గొని మాట్లాడారు. రామ మందిరం నిర్మాణానికి ఎందరో ప్రాణాలను త్యాగం చేశారని వారి ఆత్మలకు జనవరి 22న శాంతి చేకూర బోతుందని పేర్కొన్నారు. అయోధ్య రామ మందిరంలో పూజలు నిర్వహించిన అక్షింతలు ప్రతి ఇంటికి రావడం ప్రతి భారతీయుడి అదృష్టమని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వడ్డీ మోహన్‌రెడ్డి, సీనియర్ నాయకుడు నర్సింహారెడ్డి, సర్పంచ్ గుండారం శంకర్, పీఏసీఎస్ చైర్మన్ రాజారెడ్డి, డైరెక్టర్ పోతారెడ్డి, లక్ష్మారెడ్డి, సాయిబాబా, నాగరాజు, బీజేపీ మండల అధ్యక్షుడు మనోహర్, నాయకులు అడ్లూరి శ్రీనివాస్, శ్రీధర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



ఎడపల్లి: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ పేర్కొన్నారు. మండలంలోని ఠానాకలాన్‌లో వికసిత్ సంకల్ప్ భారత్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఆవాస్ యోజన పథకం ద్వారా నిరుపేదలకు ఇళ్లు నిర్మించుకోవడానికి రూ.2 లక్షలు, కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రైతులకు పెట్టుబడి సహాయం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పాల్దా భాస్కర్ రెడ్డి, ఆయా శాఖల అధికారులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డి మోహన్‌రెడ్డి, శ్రీధర్, సుర కిరణ్, ఇంద్రకరణ్,పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంకాపూర్‌ను సందర్శించిన వరంగల్ రైతులు



పెర్కిట్: ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామాన్ని వరంగల్, హన్మకొండ జిల్లాల రైతులు శనివారం సందర్శించారు. నాబార్డు వారి సహకారంతో సహాయ సోషల్ సర్వీస్ సేవా సొసైటీ ఆధ్వర్యంలో అంకాపూర్‌ను సందర్శించిన రైతులు గ్రామంలో సాగవుతున్న పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. గ్రామంలో నీటి నిలువ తొట్టెలు, విత్తన శుద్ధి కర్మగారాలను పరిశీలించారు. అనంతరం గురడి రెడ్డి రైతు సంఘం సభ్యులు కేకే భాజన్నతో సమావేశమై పంటల సాగులో అంకాపూర్ రైతులు అవలంభిస్తున్న విధానాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి విజయ్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి: సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ ప్రవేశాల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు సంస్థ నిజామాబాద్ రీజనల్ కోఆర్డినేటర్ అలివేలు శనివారం తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీ వర్గాలకు చెందిన విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని అన్నారు.

మసకబారిన తెయూ ప్రతిష్ట

- ఏసీబీకి పట్టుబడిన వీసీ
- అక్రమ నియామకాలు, ఉద్యోగోన్నతులతో అభాసుపాలు
- తరచూ రిజిస్ట్రార్ల మార్పుతో కుంటుపడిన పాలన
- ప్రస్తుతం ఇన్‌చార్జి వీసీ పాలనలో..



రివైండ్ 2023

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీకి 2023 చీకటి సంవత్సరమనే చెప్పవచ్చు. తెలుగు రాష్ట్రాల్లోనే మొదటిసారిగా ఒక యూనివర్సిటీ వీసీ లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా ఏసీబీకి చేతికి చిక్కి కటకటాల పాలు కావడం మాయని మచ్చగా మిగిలింది. తెయూ వైస్-చాన్స్‌లర్‌గా ప్రొఫెసర్ రవీందర్‌గుప్తా 2019 మే 22న నియామకమయ్యారు. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి వీసీ తన చర్యలతో తరచూ వివాదాలకు మారుపేరుగా నిలిచారు. ప్రభుత్వం, వర్సిటీ పాలకమండలి(ఈసీ) అనుమతి లేకుండా జనవరి, ఫిబ్రవరి నెలల్లో 147 మందిని దినసరి కూలీల పేరిట అక్రమంగా నియమించారు. నిబంధనలకు విరుద్ధంగా ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి అక్రమంగా ఉద్యోగోన్నతులు కల్పించారు. ఈ విషయంలో తన మాట వినని రిజిస్ట్రార్లను తరచూ మార్చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఈ–టెండర్లు పిలువకుండానే ఇష్టారాజ్యంగా కంప్యూటర్లు, జిరాక్స్ మెషీన్లు, ప్రింటర్లు, ఇతర వస్తు సామగ్రిని విచ్చలవిడిగా కొనుగోలు చేశారు. ఇందుకోసం ఏకంగా ఓ ప్రైవేటు వ్యక్తిని అనధికార పీఏగా నియమించుకున్నారు. తెయూలో చోటు చేసుకున్న అక్రమ నియామకాలు, ఉద్యోగోన్నతులు, ఆర్థిక అవకతవకలు, అవినీతి వ్యవహారాలపై

'సాక్షి' వరుస కథనాలతో అక్షర సమరం సాగించింది. ఏప్రిల్ 19న నిర్వహించిన పాలకమండలి సమావేశంలో వీసీపై చర్యలకు పూనుకుంది. వీసీ నియమించిన ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ విద్యావర్ధినిని తొలగించి రెండేళ్ల కాలానికి ప్రొఫెసర్ యాదగిరిని నియమించారు. బాధ్యతలు చేపట్టిన యాదగిరి అక్రమ నియామకాలు, ఉద్యోగోన్నతులను రద్దు చేశారు. ఆర్థిక అవకతవకలపై ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు విచారణ ప్రారంభించారు. ఇంతలోనే ఈసీ నిర్ణయంతో విభేదించిన వీసీ కోర్టు ద్వారా మధ్యంతర ఉత్తర్వులు తేవడంతో విచారణ తాత్కాలికంగా నిలిపివేశారు.

- మే 3న వీసీ రవీందర్ ఓయూకు చెందిన ప్రొఫెసర్ నిర్మలాదేవిని ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా నియమించారు.
- మే 5న పాలకమండలి మళ్లీ ప్రొఫెసర్ యాదగిరిని రిజిస్ట్రార్‌గా నియమించింది. దీంతో ఇక్కడి రాజకీయాలను తట్టుకోలేక మే 9న నిర్మలాదేవి తిరిగి ఓయూకు వెళ్లిపోయారు.
- మే 10న మళ్లీ రిజిస్ట్రార్‌గా యాదగిరి బాధ్యతలు చేపట్టారు. అయితే వీసీ రవీందర్ మే 26న ప్రొఫెసర్ కనకయ్యను ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా నియమించారు. రిజిస్ట్రార్ హోదాలో యాదగిరి, కనకయ్య ఇద్దరూ చాంబర్‌కు రావడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. ఉద్యోగులు, విద్యార్థి సంఘాలు విడిపోయి ఇద్దరికి వేర్వేరుగా మద్దతు తెలిపారు.
- జూన్ 3న మరోసారి సమావేశమైన పాలకమండలి వర్సిటీలో నిర్వహించిన అక్రమాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం, ఏసీబీతో విచారణ చేపట్టాలని తీర్మానించింది.
- జూన్ 6న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు వర్సిటీపై దాడులు నిర్వహించారు. కొన్ని రికార్డులు, కంప్యూటర్ హార్డ్ డిస్క్‌లను స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ సోదాలు జరుగుతుండగానే వీసీ రవీందర్ కొన్ని రికార్డులను తనవెంట తీసుకుని వాహనంలో హైదరాబాద్‌కు వెళ్తుండగా భిక్కనూర్ టోల్‌ప్లాజా సిబ్బంది ద్వారా వాహనాన్ని నిలిపి వేయించి వాటిని స్వాధీనం చేసుకున్నారు.
- జూన్13న వర్సిటీలో నెలకొన్న వివాదంతో బోధన, బోధనేతర సిబ్బంది వేతనాలు నిలిచిపోయాయి. ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, విద్యార్థి సంఘాల నాయకులు వీసీని సుమారు 6గంటల పాటు ఘెరావ్ చేశారు.

విషయం తెలిసి 14న విజిలెన్స్ అధికారులు మరోసారి వర్సిటీకి వచ్చారు. 15న వీసీకి డబ్బులు ఇచ్చిన వారిని హైదరాబాద్ పిలిపించి విచారణ చేపట్టారు.

- ఒకేసారి అన్ని రకాల సమస్యలు చుట్టుముట్టి ఉక్కిరిబిక్కిరై వెనక్కు తగ్గిన వీసీ జూన్ 16న తిరిగి యాదగిరిని రిజిస్ట్రార్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఏసీబీకి పట్టుబడి..

జూన్ 17న హైదరాబాద్‌లో తెయూ పాలకమండలి సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరు కావడానికి సిద్ధమవుతున్న వీసీ రవీందర్ అనూహ్యంగా ఏసీబీకి పట్టుబడ్డారు. వర్సిటీ అనుబంధ ప్రైవేటు డిగ్రీ కాలేజీకు పరీక్షా కేంద్రం కేటాయింపు విషయమై రూ.50 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. దీంతో అధికారులు ఏసీబీ కోర్టులో హాజరుపర్చి ఆయనను జైలుకు తరలించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో యూనివర్సిటీ వీసీ ఏసీబీకి పట్టుబడి జైలుకెళ్లడం తొలిసారి కావడం సంచలనం సృష్టించింది. దీంతో తెయూ ప్రతిష్ట దిగజారిందనే చెప్పవచ్చు. అనంతరం జూలైలో ఆయన బెయిల్‌పై బయటకు వచ్చారు. వెంటనే అప్పటి విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ వాకాటి కరుణను ప్రభుత్వం తెయూ ఇన్‌చార్జి వీసీగా నియమించింది. యూనివర్సిటీలో చోటుచేసుకున్న అక్రమాలు, అవినీతిపై అక్షర సమరం సాగించిన 'సాక్షి' కథనాలపై వర్సిటీ విద్యార్థులు, సిబ్బంది 'థాంక్యూ సాక్షి' అంటూ పలుచోట్ల ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో మాజీ వీసీ రవీందర్ మరోసారి ప్రభుత్వ పెద్దల చుట్టూ తిరుగుతున్నట్లు సమాచారం. యూనివర్సిటీలో జరిగిన పరిణామాలు ఈ విద్యాసంవత్సరంలో అడ్మిషన్లపై ప్రభావం చూపాయని అధ్యాపకులు పేర్కొంటున్నారు.

అరుదైన శస్త్ర చికిత్సలు జీజీహెచ్ సొంతం

- పెరుగుతున్న రోగుల సంఖ్య
- రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిన లాప్రోస్కోపిక్, మేజర్ సర్జరీలు
- వార్షిక నివేదికలో జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రతిమారాజ్

ఖలీల్‌వాడి: జిల్లా ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎన్నో అరుదైన శస్త్ర చికిత్సలను రోగులకు అందించిన ఘనత జీజీహెచ్ సొంతం చేసుకుందని సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ అన్నారు. ఆస్పత్రిలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి నిత్యం అవుట్ పేషెంట్లు 2 వేల మంది వస్తున్నారని ఇన్ పేషెంట్ల సంఖ్య కూడా 200 నుంచి 400 వరకు పెరిగిందన్నారు. టీ హబ్ ద్వారా ఈ ఏడాదిలో 4,41,452 మందికి రక్త పరీక్షలు నిర్వహించడంతో టీ హబ్ సెంటర్ రాష్ట్రంలో 2వ స్థానంలో నిలిచిందన్నారు. ఇప్పటి వరకు 214 మందికి ఈ సీట్ ద్వారా, 1912 మందికి డి అడిక్షన్ ద్వారా, పీఐసీయూలో వెంటిలేటర్ ద్వారా 56 మందికి చికిత్స అందించినట్లు తెలిపారు. ఎముకల విభాగంలో 42 వేల మందిని అవుట్ పేషెంట్లను పరీక్షించగా మేజర్ సర్జరీలు 1703, మోకాలి చిప్ప మార్పిడి శస్త్ర చికిత్సలు 81, మైనర్ సర్జరీలు 500 నిర్వహించినట్లు పేర్కొన్నారు. జనరల్ సర్జరీ విభాగంలో అవుట్ పేషెంట్‌లు 46800 మంది, ఇన్ పేషెంట్లు 7000, మేజర్ సర్జరీలు 2500 మందికి చేసినట్లు చెప్పారు.

గైనకాలజీ విభాగంలో 6600 ప్రసవాలు

ఇన్‌పేషెంట్ల అడ్మిట్, లాప్రోస్కోపిక్ సర్జరీలలో రాష్ట్రంలో మొదటి స్థానం, మేజర్ సర్జరీలో రెండవ స్థానంలో జీజీహెచ్ ఉందన్నారు. గైనకాలజీ విభాగంలో 6600 ప్రసవాలు, 3600 సాధారణ ప్రసవాలు చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాదిలో 380 డయాలసిస్ నిర్వహించినట్లు తెలిపారు.

నష్టం అపారం.. పరిహారం అంతంతే..

మోర్తాడ్: ఈ ఏడాది అకాల వర్షాలతో సాగు చేసిన పంటలు నీట మునగడం, నేలరాలడం, చెక్‌డ్యాంల నిర్మాణంలో సాంకేతిక లోపాలు చోటు చేసుకోవడంతో జిల్లాలోని రైతాంగానికి అపారమైన నష్టం వాటిల్లింది. పరిహారం చెల్లించడంలో జోరుగా ప్రచారం చేసుకున్న గత ప్రభుత్వం సరైన కార్యాచరణ అమలు చేయకపోవడంతో రైతులకు అందిన పరిహారం అంతంత మాత్రమే ఉంది. ఎకరానికి రూ.10వేల చొప్పున సాయం ప్రకటించిన నాటి సీఎం కేసీఆర్ నేటికీ రైతులకు అందలేదు. బాల్కొండ నియోజకవర్గంలోని పెద్దవాగు, కప్పలవాగులలో పలు చోట్ల నిర్మించిన చెక్‌డ్యాంలలో సాంకేతిక లోపాలు చోటు చేసుకున్నాయి. సుంకెట్, బెజ్జోరాల వద్ద చెక్‌డ్యాంలు కొట్టుకపోయి పంటలను నీరు ముంచేసింది. పాలెం, తొర్తి, వెంచిర్యాల్‌ల వద్ద రెండు చెక్‌డ్యాంలు నిండిపోయి పరిసరాల్లోని పొలాలకు నీరు చేరింది. వందల ఎకరాల్లో ఇసుక మేటలు వేసింది. చెక్‌డ్యాంల నిర్మాణానికి రూ.కోట్లు ఖర్చు చేసినా రైతులకు ప్రయోజనాల కంటే నష్టమే ఎక్కువ జరిగింది.

అకాల వర్షాలతో పంట నష్టపరిహారం ఇలా..

పంట నష్టం(విస్తీర్ణం) 9,170 ఎకరాల్లో
బాధిత రైతుల సంఖ్య 8,702
మంజూరు చేసిన మొత్తం రూ.9,17,09,500.

రూ. 6 లక్షల విలువైన నకిలీ మందులు సీజ్



నిజామాబాద్‌నాగారం: హైదరాబాద్‌కు చెందిన రామ్స్ ఫార్మస్యూటికల్స్ వారు లైసెన్సు లేకుండా అక్రమంగా మందులు తయారు చేసి నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో గల బయోమెడిక్ ఫార్మస్యూటికల్స్ లిమిటెడ్‌కు సరఫరా చేశారు. సమాచారం అందుకున్న డ్రగ్స్ డిప్యూటీ డైరెక్టర్ పి సరళ ఆధ్వర్యంలో అసిస్టెంట్ డైరెక్టర్ నర్సయ్య నేతృత్వంలో శనివారం నిజామాబాద్‌లో దాడులు నిర్వహించి రూ. 6 లక్షల విలువైన నకిలీ మందులు, క్యాపూల్స్ స్వాధీనం చేసుకున్నారు. నాలుగో టౌన్‌లో కేసు నమోదు చేశారు. దాడుల్లో డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, శ్రీలతలు పాల్గొన్నారు. అదేవిధంగా శుక్రవారం హైదరాబాద్‌లోని మూసాపేట్ రాజీవ్‌గాంధీనగర్ మొదటి అంతస్తు ఫ్లాట్ నంబర్ 1లో రామ్స్ ఫార్మస్యూటికల్స్‌పై అసిస్టెంట్ డైరెక్టర్ జి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఫుడ్‌లైసెన్సు పేరుతో డ్రగ్స్ లైసెన్సు లేకుండా అక్రమంగా మందులు తయారు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దాడిలో

ఎసోమెప్రజోల్ గ్యాస్ట్రో- రెసిస్టెంట్, డోంపెరిడోన్ సస్టైన్డ్ రిలీజ్ క్యాపుల్స్, సాడ్ హె మ్రజా, డేరాబస్స్ తదితర లేబుల్స్‌తో కూడిన మందులు అక్రమంగా తయారు చేస్తున్నట్లు తెలిసింది. క్యూపీ ఫార్మకెం లిమిటెడ్ పేరును ఉపయోగించి రహస్యంగా రామ్స్ ఫార్మస్యూటిక్స్‌లో మందులు తయారు చేస్తున్నారు. దాడుల్లో డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు ఎస్ సహజ, శ్రీ బిందు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై స్కార్పియో దగ్ధం



దగ్ధమవుతున్న స్కార్పియో

మద్నూర్: మండలంలోని రూసేగావ్ సమీపంలో ఉన్న జాతీయ రహదారిపై స్కారిపయో దగ్ధమైనట్లు మండల ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ నర్సింహులు శనివారం తెలిపారు. హైదరాబాద్‌లోని మల్లపల్లికి చెందిన ఫరీద్‌ఖాన్ అతని నలుగురు మిత్రులు దెగ్లూర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా రూసేగావ్ గేటు వద్ద ఒక్కసారిగా పొగ రావడంతో నిలిపివేశారు. దీంతో వాహనంలో మంటలు చెలరేగడంతో స్కార్పియో వాహనం పూర్తిగా కాలిపోయింది. అందులో ఉన్న వారు వెంటనే దిగడంతో ఎలాంటి ప్రాణనష్టం కలుగలేదని పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో సామగ్రి..

మాచారెడ్డి: విద్యుదాఘాతంతో ఇంట్లోని విలువైన సామగ్రి ధ్వంసమైన ఘటన మండలంలోని చుక్కాపూర్‌లో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పాపగారి రఘుపతి ఇంట్లో విద్యుదాఘాతం సంభవించడంతో మంటలు చెలరేగాయి. దీంతో బాధిత కుటుంబీకులు భయంతో బయటకు పరుగులు తీశారు. ప్రమాదంలో నగదు, బంగారం, వెండి ఆభరణాలు, దుస్తులు, వంట సామగ్రి దగ్ధమయ్యాయి. అలాగే రఘుపతి కుమారుడు దశరథ్‌కు చెందిన పది, ఇంటర్ మెమోలు దగ్ధమైనట్లు బాధితులు పేర్కొన్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత కుటుంబీకులు కోరారు.

బోధన్‌లో 961 కేసుల పరిష్కారం



మాట్లాడుతున్న న్యాయమూర్తి రవికుమార్

బోధన్: మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం పట్టణ కేంద్రంలోని కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్ కేసులు 961 పరిష్కారమయ్యాయి. జిల్లా ఐదో అదనపు న్యాయమూర్తి రవికుమార్, సీనియర్ సివిల్ జడ్జి అజయ్‌కుమార్, ఇన్‌చార్జి జూనియర్ సివిల్ జడ్జి గోపికృష్ణల నేతృత్వంలో మూడు బెంచ్‌లను ఏర్పాటు చేశారు. న్యాయవాదులు హన్మంత్‌రావు, మారుతిరావు ఖన్నా, మధుసింగ్, శ్రీలక్ష్మి బెంచ్ సభ్యులుగా వ్యవహరించారు. ఏపీపీలు సమ్మయ్య, శ్యాంరావు, ఏజీపీ మోహన్‌కుమార్, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నీరడి ఈశ్వర్, న్యాయవాదులు,కోర్టుఉద్యోగసిబ్బందిపాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. న్యాయమూర్తి హారిక జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోదగ్గ కేసులను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. వీటిలో 66 క్రిమినల్, 64 ఆబ్కారీ, బ్యాంకు కేసులు 2472, పీటీ కేసులు 398 పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీపీ వీరయ్య, ఏజీపీ శ్రీనివాస్, న్యాయవా దులు పండరి, సాయిప్రకాశ్ దేశ్‌పాండే, సతీశ్, గోపాల్‌రావు, నవీద్, సాయిబాబా పాల్గొన్నారు.

చరిత్ర గ్రంథాలయానికి ఇతిహాస గ్రంథాల బహూకరణ

- అందజేసిన మంచాల శంకరయ్య గుప్తా ట్రస్ట్ చైర్మన్ జ్ఞానేందర్ గుప్తా



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఇతిహాస సంకలన సమితి (భారతీయ) ఇందూరు శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోనే మొదటిసారిగా నగరంలోని కోటగల్లీలో ఏర్పాటు చేసిన చరిత్ర గ్రంథాలయానికి భగవద్గీత(తెలుగు, హిందీ, ఆంగ్లం) గ్రంథాలు, శ్రీమద్దేవీభాగవతం గ్రంథాలను, మంచాల శంకరయ్య గుప్తా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మంచాల జ్ఞానేందర్ గుప్తా శనివారం బహూకరించారు. రామాయణం, మహాభారతం గ్రంథాలను సైతం మరో మూడు రోజుల్లో ఇస్తానని అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకుడు కందకుర్తి ఆనంద్ పాల్గొన్నారు.

పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు



పనుల వివరాలను పరిశీలిస్తున్న అధికారులు

బోధన్ రూరల్: ఉపాధి హామీ పథకంలో అవకతవకలకు పాల్పడిన అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని డీఆర్డీఏ చందర్ నాయక్ అన్నారు. బోధన్, సాలూర మండలాల్లోని గ్రామాల్లో ఐదు రోజుల నుంచి సామాజిక తనిఖీ బృందం తనిఖీలు చేపట్టింది. బోధన్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. బోధన్, సాలూరా మండలాల్లోని గ్రామాల్లో 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు ఉపాధి హామీ పనులపై ప్రజా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారుల తనిఖీల్లో రికార్డుల నిర్వహణ, హరితహారం మొక్కల లెక్కలు, కూలీలకు డబ్బుల చెల్లింపులు, అధికారుల సంతకాలు వంటి పలు అంశాల్లో తప్పిదాలు జరిగినట్లు గుర్తించారు. తప్పిదాలను సరిదిద్దుకోవాలని డీఆర్డీఏ ఆదేశించారు. ఏడాది పాటు రూ. 4 కోట్ల 80 లక్షల ఉపాధి హామీ పనులను చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రజావేదికలో బోధన్ ఎంపీడీవో పర్బన్న, ఎంపీఓ మధుకర్, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య



శివయ్య (ఫైల్)

మోపాల్: మండలంలోని కులాస్పూర్ గ్రామానికి చెందిన పసూల శివయ్య (67) పెద్ద చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌హెచ్‌ఓ గంగాధర్ శనివారం తెలిపారు. శివయ్య వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శివయ్య మద్యానికి అలవాటు పడడంతో భార్య భర్తల మధ్య గొడవలు జరిగేవి. దీంతో ఈనెల 26న ఇంటి నుంచి వెళ్లిన శివయ్య తిరిగి రాలేదు. శుక్రవారం రాత్రి చెరువులో అతని మృతదేహం లభ్యమైందన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ పేర్కొన్నారు.

నిందితుల అరెస్ట్



మోర్తాడ్: మండలంలోని ధర్మోరాలో దొంగతనాలకు పాల్పడిన ముగ్గురు నిందితులను పట్టుకొని అరెస్టు చేసి వారి నుంచి 18 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆర్మూర్ ఏసీపీ జగదీశ్ చందర్ తెలిపారు. మోర్తాడ్ పీఎస్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. భీమ్‌గల్ సీఐ వెంకటేశ్వర్లు, మోర్తాడ్ ఎస్సై అనిల్‌రెడ్డి సాంకేతిక సాయంతో దొంగతనానికి పాల్పడిన వారిని గుర్తించారు. రైల్వే స్టేషన్‌లో అనుమానస్పదంగా తిరుగుతున్న నాందేడ్ జిల్లా ఉమ్రి తాలుకాకు చెందిన ముండ్కర్ నాందేవ్, మాణిక నారాయణ్ షిండే, శివానంద్ గంగాధర్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా ధర్మోరాలో జరిగిన దొంగతనం చేసింది తామే అని అంగీకరించినట్లు తెలిపారు. నిందితులను చాకచక్యంగా పట్టుకొని అరెస్టు చేసిన పోలీసులకు రివార్డు అందిస్తామని ఏసీపీ పేర్కొన్నారు.

బైక్ చోరీ కేసులో..

ఖలీల్‌వాడి: బైక్ చోరీ చేసిన నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ నరహరి తెలిపారు. నగరంలోని మూడో టౌన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రశేఖర్ కాలనీలో సిబ్బంది చేపట్టిన వాహనాల తనిఖీలో నిందితులు షేక్ మాజీద్, మహమ్మద్ అమన్, షేక్ సాజిద్ బైక్‌లను వదిలి పారిపోతుండగా ఎస్సై వారిని పట్టుకొని విచారింగా తొమ్మిది బైక్‌లను దొంగిలించినట్లు తెలిపారు. వీటిని జల్లపల్లికి చెందిన షేక్ ఫైజల్లా అనే వ్యక్తికి విక్రయించినట్లు చెప్పారు. జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన ఎస్సై ప్రవీణ్, సిబ్బంది షౌకత్ అలీ, చామీంద్, అఫ్సర్‌లను ఏసీపీ అభినందించారు.

రేషన్ బియ్యం పట్టివేత



పెద్దకొడప్‌గల్: మండల కేంద్రంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై కోనారెడ్డి తెలిపారు. శనివారం సాయంత్ర నిర్వహించిన వాహనాల తనిఖీలో బోలేరోలో తరలుతున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. సుమారు 40 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అల్ప్రాజోలం పట్టివేత



బిచ్కుంద: మండలంలోని పెద్దదేవాడ గ్రామంలోని కల్లుడిపోపై దాడి నిర్వహించినట్లు ఎస్సై మురళి శనివారం తెలిపారు. కల్లులో కలపడానికి సిద్ధంగా ఉన్న నిషేధిత 20 గ్రాముల అల్ప్రాజోలం సింథటిక్ డ్రగ్‌ను పట్టుకున్నట్లు చెప్పారు. కల్లు డిపో నిర్వాహకుడు ముత్యాల్‌వార్ గంగాగౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ఉమేశ్ మృతదేహం

లింగంపేట: మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి శివారులోని ఎల్లమ్మ ఆలయం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉమేశ్(24) మృతి చెందినట్లు ఎస్సై ప్రభాకర్ శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్‌కు చెందిన ఉమేశ్ ఎల్లారెడ్డిలోని జియో కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. కామారెడ్డిలో ఉన్న తన సోదరుడిని చూసేందుకు వచ్చి తిరిగి బయలు దేరుతుండగా శెట్పల్లి సంగారెడ్డి శివారులో బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొన్నాడు. ఈ ఘటనలో అత ను అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు వి లపించిన తీరు అందరిని కంటతడిపెట్టించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరు..

వేల్పూర్: కుకునూర్ గ్రామానికి చెందిన కొండెం విఘ్నేశ్ (21) ఈనెల 26న గడ్డి మందు సేవించి ఆత్మహత్యకు యత్నించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందినట్లు ఎస్సై వినయ్‌కుమార్ శనివారం తెలిపారు. అదే గ్రామానికి చెందిన మహిళతో ఎనిమిది నెలల కిందట వివాహం జరిగింది. దంపతుల మధ్య గొడవ జరగడంతో గడ్డిమందు సేవించినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు..

డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) గ్రామానికి చెందిన ఈశ్వరి (58) అనే వృద్ధురాలు అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు ఎస్సై మహేశ్ శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని గురుకుల పాఠశాలలో అటెండర్‌గా పని చేస్తున్న ఈశ్వరి శుక్రవారం రాత్రి తన ఇంట్లో నిద్రించింది. ఉదయం ఈశ్వరి అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. మృతురాలి కుమార్తె చందన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మద్నూర్‌లో దొంగల హల్‌చల్

మద్నూర్: మండల కేంద్రంలో దొంగలు హల్‌చల్ చేయడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. శుక్రవారం రాత్రి గాంధీచౌక్ సమీపంలోని శంకర్‌రావు అనే రిటైర్డ్ ట్రాన్స్‌కో అధికారి మూడు రోజుల క్రితం వారు నిజామాబాద్‌కి వెళ్లడంతో దుండగులు చోరీకి యత్నించారు. తాళం పగలక పోవడంతో వారు వెనుతిరిగారు. స్థానిక దుర్గామాతా ఆలయానికి ఉన్న మూడు తాళాలను పగులగొట్టి అమ్మవారి మెడలో ఉన్న రోల్డ్‌గోల్డ్ నగలను దొంగిలించినట్లు కాలనీవాసులు తెలిపారు. పోలీసులు పెట్రోలింగ్ ముమ్మరం చేసి దొంగలను పట్టుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.